# పెనం మీద అట్టు

అర్జెంటుగా ఆఫీసు పనిమీద మచిలీపట్నం వెళ్ళవలసొచ్చి డీలక్స్ బస్సు ఎక్కాను.

బస్సు నిండా జనం. నిలబడి ప్రయాణం చేయాలి కాబో(్రా దేవుడా అనుకుంటూ ఉండగా ఆపద్బాంధవుడిలా "రావయ్యా కూర్చో" అంటూ ప్రక్కకు జరిగాడు ఓ ఆసామి.

అతడు రామాపురం సర్పంచ్ రాజయ్య. చిన్నప్పుడు నేను పదవ తరగతి వరకు ఈ ఊళ్ళోనే చదువుకోవడం వల్ల నన్నుతడు సులభంగా గుర్తుపట్టాడు.

వినయంగా విష్ చేసి ప్రక్కన కూర్చున్నాన్నేను. బస్సు బయలుదేరింది. "ఎక్కడుంటున్నావ్? ఏం చేస్తున్నావ్?"అడిగాడు సర్పంచి.

చెప్పాను. ఇక నేనేమి అడక్కుండానే రామాపురం సంగతులన్నీ చెప్పుకుపోతున్నాడు. ఊ కొట్టడం నావంతైంది.

కూర్చోడానికి సీటుతోపాటు కాలక్షేపానికి తోడు కూడా తోడవడంతో సమయం సునాయాసంగా సాగిపోసాగింది. "మీరు ఎంత వరకు వెళుతున్నారు"? మరీ మూతి బిగించి కూర్చుంటే బాగుండదని అడిగాను.

"ఇంకెక్కడికి"?... మనూరే రామాపురం"

"ఇది ఎక్స్‌ప్రెస్ కదా, అక్కడ ఆగుతుందో ఆగదో" అన్నాను సందేహంగా.

"ఎక్స్‌ప్రెస్సే కాదు దాని బాబైనా ఆగుద్ది" అన్నాడు సర్పంచి. ఆ మాట అంటున్నప్పుడు అతడి కంఠంలో కించింత్ గర్వం తొణికిసలాడుతోంది.

"కృష్ణాపురంలోనే ఆగని బస్సు రామాపురంలో ఆగుతుందా?" నాలో నేను అనుకున్నాను.

"బస్సు అక్కడ ఆగకపోతే కండక్టరు ఆ ఊరుకి టిక్కెట్టివ్వడు కదా"! నా మనసులో మాటకు అడ్డంపడ్డాడు రాజయ్య.

"రామాపురం కృష్ణాపురం కంటే చిన్నఊరు కదా అందుకన్నాను."

"అయితేనేం దానికి శానా పెద్ద కతుందిలే" అన్నాడు రాజయ్య. ఆ మాటకు విస్మయంగా చూశాను. అప్పటికే బస్సు బాగా జోరందుకుంది. నా ఆదుర్దా గమనించినట్లుంది చెప్పడం మొదలు పెట్టాడు రాజయ్య.
శ్రోతనయ్యాన్నేను.

"పెబుత్వ పార్టీలో ఉండి ఆ బస్సుని మానూళ్ళో ఆపించుకోలేకపోతున్నామంటే మన సేతగానితనంగాక ఇంకేటి?" ఆవేశం వెలిబుచ్చాడు ఎఱ్రునాయుడు.



"నీకు తెల్సునో తెల్దో ఆ పనికి ఎగస్పార్టీవోళ్ళు పూనుకుంటున్నారంట. అదే ఆళ్ళవల్లయితే మన పిస్టేజీ ఏం గావాల? అన్నాడు సత్యం నాయుడు.

"అప్పుడు మనం గాజులు తొడుక్కున్నట్టవుద్ది" ఎగతాళి చేశాడు ఎఱ్రునాయుడు. " అంతే కాదు రేపెలచ్చన్లో ఆళ్ళే మనకుగట్టి పోటీ అయిపోతారు. అప్పుడు మన బాకాలేవీ పన్జేయవ్" హెచ్చరించాడు సత్యంనాయుడు.

"ఆ మాట నిజమే, పంచాయితీ ఎలచ్చన్లు దాపుకొచ్చేస్తున్నాయి. దీనికి మనమంతా కల్సి ఏదో ఒక ఆలోచన సేయాల" వాళ్ళ గొంతులో గొంతు కలిపాడు రాజయ్య.

"అందుకంత ఆలోచన దేన్కి. ఎట్టానూ ఎల్లుండి రవాణా మంత్రిగారు ఈడకొస్తూనే ఉన్నారు. అడిగిస్తే పోలా?" ఎఱ్రు నాయుడి సలహా అందరికీ ఆమోదయోగ్యంగా తోచింది.

అనుకున్నట్టుగానే అమాత్యుల వారిని కలిసి తమ విన్నపాన్ని విన్నవించుకున్నారు వినయంగా.

"మీరడిగిన సోటెల్లా బస్సాపుకుంటూ పోతే అదిఎక్స్‌ప్రెస్ ఎట్టా అవుద్ది? మీక్కావాలంటే చెప్పండి మరో బస్సేయిస్తాను."

మంత్రివర్యుని మాటలకు ఏం సమాధానమివ్వాలో స్ఫురింపక వెఱ్ఱి మొహం

పెట్టారు సర్పంచి బృందం. ఇప్పటికిప్పుడు మరో బస్సు అవసరం వాళ్ళకేంలేదు. ఉన్న బళ్ళకే కలెక్షన్లు లేవు. పైగా ఆటోలు విచ్చలవిడిగా తిరుగుతూనే ఉన్నాయి.

"ఆ ఎక్స్‌ప్రెస్ బస్సుని ఇక్కడే ఆపిస్తామంటూ సవాలు చేసి ఎల్లారు. ఏది ఎక్కడాగింది? సూత్తుండగానే మన కంట్లో దుమ్ము కొట్టుకుంటూ ఎల్లిపోనాది. సేతగానోళ్ళు. దేనికైనా చేవుండాలి."

ప్రత్యర్థుల వెక్కిరింపులకు ఉడికిపోయాడు రాజయ్య.

అసెంబ్లీ ఎలక్షన్లొచ్చాయ్.

మీటింగులు మొదలయ్యాయి. ఆ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రవాణా మంత్రిగారొచ్చారు.

"నన్ను గెలిపించారంటే మీ అందరికీ పక్కా ఇళ్ళు కట్టించే ఏర్పాటు చేస్తాను. అడక్కుండానే రుణాలిప్పిస్తాను. ఆ తర్వాత వాటిని మాఫీ చేయిస్తాను" అంటూ వాగ్దానాలవర్షం కురిపించాడు.

మీరు మాకేం సేయనక్కర్లేదు. మేం అడిగిన బస్సును మానూళ్ళో ఆపించేలా సేయగలరో లేదో సెప్పండి" సవాలు విసిరాడు రాజయ్య.

"దానికేం భాగ్యం. ఇవాళే డిపోమేనేజరుతో మాట్లాడుతాను. సరేనా?" హామీ గుప్పించారు అమాత్యులవారు.

"అదీ కత. మర్నాటి నుండే ఆబస్సు మా ఊళ్ళో ఆగడంతో ప్రత్యర్థుల నోళ్ళు మూతపడ్డాయ్" అంటూ గర్వంగా చూశాడు నా వంక.

"బాగానే ఉంది గాని ప్రజలు కోరుతున్నారని ఎక్స్‌ప్రెస్ బస్సుకు ప్రతిచోటా హాల్టిచ్చెస్తూ ఉంటే అది పోతుల బండి కంటే కనికిష్టమైపోతుంది. చార్జీలో తప్ప ఎక్స్‌ప్రెస్‌కి ప్యాసింజరుకు తేడా ఏముంటుంది"? అన్నాను అతడు చేసిన పనికి అయిష్టంగా.

"అప్పుడు దూర ప్రయానీకులంతా ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగులు ఎక్కువైపోనాయని ధర్నాలు సెయ్యాల. రాలీలు సేపట్టాల. అలానే రాస్తోరోకోలు అవసరమనుకుంటే నిరాహార దీచలు."

"అలా చేస్తే కథ మళ్ళీ మొదటికి రాదు"?

"వస్తాదయ్యా ఎందుకు రాదూ. మంది పెజాసామ్యం. పెజల కోరికలు పెనం మీద అట్లు లాంటివి. రెండు పైపులా కాల్తుంటాయి మరి. రాజయ్య చెప్పిన నగ్న సత్యాన్ని జీర్ణించుకునే లోపలే రామాపురం వచ్చేసింది.

రాజయ్య దిగిపోయాడు.

( 20 అక్టోబరు 2002 ఆంధ్రప్రభ డైలీ )